892) దేశాక్షి / కాపీ

ప॥ అడుగరె చెలులాల అతనినే ఈ మాట। వుడివోని తమకాన నుండబోలు తాను॥

చ॥ వేడుకగలప్పుడే వెస నవ్వు వచ్చుగాక। వాడి వున్నప్పుడు తలవంపులే గావా।
ఏడనో సతులచేత ఏపున బడి రాబోలు। ఈడనే జెనకగాను ఇటులా నుండునా॥

చ॥ ఆసల గూడినప్పుడే ఆయాలు గరగు గాక। పాసి వున్నప్పుడు తడబాటులే గావా।
బేసబెల్లి వలపులు పిరివీకై రాబోలు। సేసనే బెట్టగాను సిగ్గువడి వుండునా॥

చ॥ సరసమాడినప్పుడే చవులెల్లా బుట్టుగాక। కొరవైనయప్పుడు కొరతలే గావా।
ఇరవై శ్రీవేంకటేశుడింతలోనే నన్ను గూడె। వరుసనిందాక నిటువలె జొక్కకుండునా॥